వైద్యులు నిజమైన హీరోలు: ఏసీపీ శంకర్‌రాజు


అవగాహన కలిగిస్తున్న ట్రాఫిక్ టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

అబిడ్స్: వైద్యులు అహర్నిశలు శ్రమించే నిజమైన హీరోలని ట్రాఫిక్ టీటీఐ బేగంపేట ఏసీపీ జి.శంకర్‌రాజు పేర్కొన్నారు. బషీర్‌బాగ్ ఆదర్శ్‌నగర్‌లోని హోప్ ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి, వైద్యులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ..ప్రజలు దైవంగా భావించే వైద్యులకు కూడా ట్రాఫిక్‌పై అవగాహన కల్పించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పలు చౌరస్తాల్లో సిగ్నల్స్ పడ్డప్పటికీ కొంత మంది వాహనదారులు సిగ్నల్ జంప్ చేయడం ద్వారానే ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెంట్, సీటు బెల్టు ధరించాలన్నారు. అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో హోప్ ఆసుపత్రి ఎండీ మదన్‌మోహన్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

శరత్‌కుమార్‌కు పురస్కారం


శరత్‌కుమార్‌కు పురస్కారాన్ని అందజేసి సత్కరిస్తున్న కేవీ రమణ

నాంపల్లి: గరిమెళ్ళ రామమూర్తి 88వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను రసరంజని సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళామందిరంలో జరిగిన వేడుకల్లో గరిమెళ్ళ రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సినిమా నటుడు నిట్టల శరత్‌కుమార్‌కు రంగస్థల పురస్కారం–2024 ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణ హాజరై పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రసరంజని ఉపాధ్యక్షులు దుగ్గిరాల సోమేశ్వరరావు, అమృత అవార్డు గ్రహీత బీఎం రెడ్డి, నాటక ప్రయోక్త ఎం.సుబ్బరాయశర్మ తదితరులు పాల్గొన్నారు. సభా ప్రారంభంలో మాడుగుల రామకృష్ణ రచించిన, టీవీ పురుషోత్తం దర్శకత్వంలో మైత్రీ కళా నిలయం విజయవాడ వారిచే 'బంధం'నాటికను ప్రదర్శించారు.

ఘనంగా అమావాస్య పూజలు



జియాగూడ: ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ కార్వాన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా అమావాస్య రోజున గో గ్రాస సేవా, మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఐపీపీ యాద శ్రీనివాస్ గుప్తా, తొడ్పునూరి బాల్‌రాజ్‌గుప్తా అన్నారు. శుక్రవారం జియాగూడ భగత్‌సింగ్ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమాన్ని పురానాపూల్ కార్వాన్ ఆర్యవైశ్య సంఘం చేపట్టింది. అధ్యక్షుడు గుండా సురేష్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి జగిని యాదగిరి గుప్తా, కోశాధికారి చిగుళ్లపల్లి గోవింద్‌గుప్తా, ప్రాజెక్టు చైర్మన్, ధనుంజయ్ గుప్తా, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ ఉపాధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా, బానూరి నిర్సములు గుప్తా, ఉడత శ్రీనివాస్, ఆర్యవైశ్య భవనం అధ్యక్షులు కందూరు నాగేంద్ర గుప్తా, ఆకారం శ్రీనివాస్, మంచుకొండ శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు. అలాగే సంజయ్‌నగర్‌లోని నల్ల పోచమ్మ తుల్జాభవానీ ఆలయంలో అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ ప్రతినిధి రావుల శ్రీనివాస్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తజనం


ఫలక్‌నుమా కాళికామాత ఆలయం వద్ద భక్తుల రద్దీ

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమాలోని శ్మశాన కాళికా మాత ఆలయానికి అమవాస్య సందర్భంగా భక్తజన తాకిడి కొనసాగింది. కోరిన కోరికలు తీరుతుండడంతో గత కొన్ని సంవత్సరాలుగా ఈ ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. అమ్మవారి మహత్యాన్ని సామాజిక మాధ్యమాల తెలుసుకున్న రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆది, మంగళ, శుక్ర వారాలలో తరలివస్తున్నారు. తాజాగా శుక్రవారం ఆషాఢ మాసం అమవాస్య కావడంతో ఆడపడుచులు భారీగా తరలివచ్చి గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏకంగా ఫలక్‌నుమా రైల్వే బ్రిడ్జి ప్రారంభం నుంచి మొదలుకొని ఆలయం వరకు వేల సంఖ్యలో భక్తులు క్యూలైన్లలో నిలబడ్డారు. కాగా ఆలయం వద్ద సరైన సదుపాయాలు, పర్యవేక్షణ లేకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు.

బోనాల జాతరకు పటిష్ట ఏర్పాట్లు


ముస్తాబవుతున్న మహంకాళేశ్వర ఆలయ రాజ గోపురం

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను ఈసారి వైభవంగా నిర్వహించడానికి మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ నిర్వాహకులు ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశారు. నిజాం కాలంలో 1805 నుంచి హైదరాబాద్ నగర ప్రజలకు కూరగాయలు, ఆకుకూరలు సరఫరా చేసే ప్రధాన కేంద్రంగా మీరాలంమండి ప్రసిద్ధి చెందింది. అప్పట్లో నగర శివారు గ్రామాలకు చెందిన రైతులు తమ పొలాల్లో పండిన పంటలను ఎడ్ల బండ్లపై ఇక్కడికి తీసుకువచ్చి ఆ బండ్లను ఇక్కడి బండి ఖానాలో నిలిపేవారు. ఆ రోజుల్లో అకాల కరువు ఏర్పడి పశువులకు వింత రోగాలు సోకటంతో రైతులంతా 1809లో కరువు కాటకాలు రాకుండా వర్షాలు పడాలని కోరుతూ అక్కడే ఒక రావి మొక్కను నాటి దాని ముందు ఒక గూటిని ఏర్పాటు చేసి పూజలు చేశారు. అప్పట్లో ఆషాఢ మాసంలోని 4వ బుధవారం అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ వస్తున్నారు. ఈ ఆనవాయితీ రానురాను ఆషాఢ మాసం బోనాల జాతరగా మారింది. ప్రస్తుతం మహంకాళేశ్వర ఆలయం అమ్మవారిగా కొలుస్తున్నారు. 1985లో ఆలయ కమిటీ చైర్మన్‌గా గాజుల అంజయ్య బాధ్యతలు తీసుకున్న అనంతరం ప్రతి ఏడాది ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది 40వ వార్షికోత్సవ బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నారు.

నేడు మహాభిషేకం..

మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో శనివారం ఉదయం మహంకాళేశ్వరి అమ్మవారికి మహాభిషేకం పూజా కార్యక్రమాలను నిర్వహించడానికి నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. అమ్మవారిని పసుపు, కుంకుమలతో పాటు అష్టోత్తర సుగంధ ద్రవ్యాలతో పూజలు నిర్వహించనున్నామన్నారు. అలంకార బ్రహ్మ శృంగారం ఆత్రేయ ఆచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ మహాభిషేకం పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం



యాకుత్‌పురా: విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరమని బేగంపేట ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఇన్‌స్పెక్టర్ వి.రాంచందర్ అన్నారు. ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం పురానీహవేలిలోని ముకర్రం జా పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై పవర్ పాయింట్ ప్రాజెంటేషన్‌తో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ట్రాఫిక్ నియమాలు పాటించాని వారిపై 2023లో 523, 382 కేసులు నమోదయ్యాయన్నారు. 2022తో పోలిస్తే 86 శాతం అధికంగా కేసులు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ముకర్రం జా పాఠశాల ప్రిన్సిపాల్ రేఖా వాదే, కార్యదర్శి సయ్యద్ ముద్దసీర్, మీర్‌చౌక్ ట్రాఫిక్ ఎస్సై అమర్‌నాథ్‌రెడ్డి, సిబ్బంది మహ్మద్ ఆయన్, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనలు ప్రశాంతం



శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సామూహిక ప్రార్థనల్లో ముస్లిం సోదరులతో పాటు మాజీ కార్పొరేటర్ తదితరులు పాల్గొన్నారు. ప్రార్థనల సందర్భంగా దక్షిణ మండలం పోలీసుల ఆధ్వర్యంలో చార్మినార్–మక్కా మసీదు పరిసరాల్లో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

వాటర్‌బోర్డు ఉద్యోగుల అభివృద్ధికి ప్రత్యేక కృషి


సమావేశంలో రాంబాబు యాదవ్, నారాయణ, లక్ష్మీనారాయణ

అబిడ్స్: వాటర్‌బోర్డు ఉద్యోగుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని వాటర్ బోర్డు ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం గోషామహల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అంచెలంచెలుగా వాటర్‌బోర్డు ఉద్యోగుల అభ్యున్నతికి పాటుపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా రాంబాబు యాదవ్‌ను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కొమురయ్య, షబ్బీర్, అంజయ్య, జనార్దన్, యాదగిరి, వేణుగోపాల్, నర్సింహ, సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు పదవుల్లో ప్రాధాన్యమివ్వాలి



గోల్కొండ: నామినేటెడ్ పదవులు, ఆలయాల పాలక మండలిలో పార్టీని మారిన వారికి కాకుండా సీనియర్ కాంగ్రెస్ నాయకులకే ప్రాధాన్యమివ్వాలని కార్వాన్ కాంగ్రెస్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు కురాకుల కృష్ణ అన్నారు. బాంజావాడిలో శుక్రవారం కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి ఆలయ బోనాల నిర్వహణ కమిటీలో సీనియర్ కాంగ్రెస్ నాయకులకు అన్యాయం జరిగిందని పార్టీలు మారిన వారికే సభ్యత్వం ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై తాము జిల్లా మంత్రితో పాటు దేవాదాయ శాఖ మంత్రిని కలిసి తమ ఆవేదనను మొరపెట్టుకుంటామన్నారు. అదే విధంగా గోల్కొండ బోనాల కమిటీలో కేవలం ఒక డివిజన్‌కు సంబంధించిన వారికే పదవులు ఇవ్వమని అడగడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. గ్రేటర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముంగి రఘుపాల్‌రెడ్డి, జియాగూడ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జి.కిషన్, జియాగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రేమ్‌కిషోర్, నాయకులు వెంకటకృష్ణ, హబీబ్ ఉన్నారు.

8న భరతనాట్య ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 8న రవీంద్రభారతిలో కనకదుర్గ నృత్య విభావరి సంస్థ 42వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ లయన్ నిర్మల ప్రభాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్‌గుప్తా, సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్‌రావులతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సంస్థ చిన్నారులచే నృత్య కుసుమాల పేరిట భరతనాట్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన ఉండాలి

సుల్తాన్‌బజార్: వర్షాకాలంలో ప్రజలు డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. శుక్రవారం వీవీ ప్రైమరీ స్కూల్ వద్ద దోమ కాటు వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. రేణుకా, రాజు, సుభాష్, రామకృష్ణ, దిలీప్, రాజశేఖర్, ప్రవీణ్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



లంగర్‌హౌస్: చిన్నారులకు సరైన భోజనం అందించడంతో పాటు ఆటాపాటలు కచ్చితంగా నేర్పాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం లంగర్‌హౌస్‌లోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విషయం తెలిసిన స్థానిక నాయకుడు మాతంగి రమేష్ అక్కడకు వెళ్లి సమస్యలను వివరించాడు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

గోల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు మెగా సిస్టమ్స్, టీచ్ ఫర్ చేంజ్ సంయుక్తంగా కృషి చేస్తున్నాయని మెగా సిస్టమ్ ప్రతినిధి ధరణికోట సుయోధన్ అన్నారు. శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్‌లోని దేవల్ ఝామ్‌సింగ్ ప్రభుత్వ, ఉన్నత పాఠశాలలో టాయిలెట్స్, నీటి ట్యాంక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద బస్తీలలో ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో మరింత మంది విద్యార్థులు చేరేలా గత దశాబ్ద కాలంగా తాము నగరంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ రంజిత, బీజేపీ నాయకులు దేవర వంశీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.